డిజిటల్ పేమెంట్ల విప్లవం

- జేబులో చిల్లిగవ్వ లేకపోయినా పర్వాలేదు
- చేతిలో స్మార్ట్ ఫోన్ అందులో పేమెంట్ యాప్‌లు ఉంటే చాలు
- టీ తాగినా ఆన్‌లైన్ చెల్లింపే

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సాంకేతిక విప్లవం మానవ జీవన విధానాన్ని సమూలంగా మార్చివేసింది. చేతిలో ఒక స్మార్ట్‌ఫోన్ అందులో పేమెంట్ యాప్ ఉంటే చాలు జేబులో చిల్లి గవ్వ లేకపోయినా దర్జాగా మార్కెట్‌లోకి వెళ్లి మనకు కావాల్సిన వస్తువును పొందే అవకాశం ఏర్పడింది. చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంకులో నగదు ఉంటే చాలు కావాల్సిన వస్తువులు కొనవచ్చు, నచ్చిన ఆహారం తినవచ్చు. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు వీధి వ్యాపార రంగంలోకి కూడా విస్తరించింది. చిరు వ్యాపారులు సైతం నగదు రహిత లావాదేవీలకు అలవాడుపడ్డారు. కొబ్బరి బొండాలు, పానీపూరి, పండ్లు, కూరగాయలు, కిరాణా షాపుల్లో, చిల్లర కొట్టుల్లో ఇలా అన్ని చోట్లా డిజిటల్ పేమెంట్లు కొనసాగుతున్నాయి. పట్టణాల నుంచి మారుమూల పల్లెటూర్ల వరకు డిజిటల్ పేమెంట్ల విప్లవం కొనసాగుతోంది.


నగరంలోని ఒక దుకాణంలో డిస్‌ప్లే పెట్టిన క్యూఆర్ కోడ్లు

కరోనాతో మార్పు

2016వ సంవత్సరంలో డీమోనిటైజేషన్‌తో రూ.2000, రూ.1000, రూ.500 నోట్ల రద్దుతో డిజిటల్ పేమెంట్లు మొదలయ్యాయి. అప్పట్లో ప్రజలు డిజిటల్ పేమెంట్లపై పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే కరోనా కారణంగా నగదు లావాదేవీలకు జనాలు భయపడ్డారు. మెల్లమెల్లగా డిజిటల్ ప్లాట్‌ఫారంలో చెల్లింపులపై ఆసక్తి కనబరిచి అనంతరం అదే విధానంలో చెల్లింపులు చేస్తున్నారు. అప్పట్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగేవి.

దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ల దర్శనం

ఏలూరు నియోజకవర్గంలో సుమారు 2.15 లక్షల జనాభా ఉన్నారు. ప్రతి ఇంటికీ రెండు లేదా మూడు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. ఈ మేరకు దాదాపుగా 7.50 లక్షల సెల్‌ఫోన్లు వినియోగంలో ఉన్నాయి. వీటిలో కనీసం 1.50 లక్షల ఫోన్ల ద్వారా డిజిటల్ పేమెంట్లు జరుగుతున్నట్లు అంచనా. బజ్జీల బండ్లు, పాన్ షాపులు, టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడు బండ్లు, రోడ్ల పక్కన ఫాస్ట్‌ఫుడ్స్, పండ్లు అమ్మేవారి వరకు డిజిటల్ పేమెంట్లు వాలిపోయాయి. ఈ విధానంలో చిల్లర సమస్యతో ఇబ్బందులు లేకుండా వ్యాపారం సజావుగా సాగిపోతోందని చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్లతో ఎలాంటి నష్టం లేదని చెబుతున్నారు. పేమెంట్ యాప్లకు సంబంధించి క్యూఆర్ కోడ్లను ఆయా సంస్థలు సులభంగా అందిస్తున్నాయి. ఏ దుకాణం వద్ద చూసినా పేమెంట్ క్యూఆర్ కోడ్లు దర్శనమిస్తున్నాయి.

స్పీకర్ బాక్సులతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు గురయ్యే ప్రమాదం కూడా ఏర్పడింది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఎంతో మంది మోసగాళ్లు వ్యాపారులను బురిడీ కొట్టించిన సందర్భాలు కోకొల్లలు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే ఖాతాకు నగదు బదిలీ చేసి, సెల్‌ఫోన్ స్క్రీన్‌పై పేమెంట్ సక్సెస్‌ఫుల్ దుకాణదారుడికి చూపించి అక్కడి నుంచి జారుకునేవారు. దీంతో ఒక దశలో వ్యాపారులు డిజిటల్ పేమెంట్‌ల విధానంపై పెదవి విరిచారు కూడా. అయితే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారుడు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్ చేసిన వెంటనే ఎంత చేశారు అనేది దుకాణదారునికి వినిపించే విధంగా ఈ బాక్స్ ఉండడంతో మోసాలకు చెక్ పడింది.

తగ్గిన నగదు లావాదేవీలు

డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి బ్యాంకులకు వెళుతున్న ఖాతాదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చేబదుళ్ల నుంచి అక్కౌంట్లకు నగదు చెల్లింపుల వరకు డిజిటల్ ప్లాట్‌ఫారం ద్వారానే లావాదేవీలు చేస్తున్నారు. మరో వైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు. ఊళ్లు వెళ్ళే సమయంలో నగదు తీసుకువెళ్లడంలో భద్రత లేకపోవడం, అలాగే బ్యాంకుల్లో నగదు వేయడానికి వెళ్లిన సమయంలో కూడా కొందరు నగదు చోరీలకు గురై నష్టపోవడం వంటివి డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తరువాత చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గిపోయింది.

తేలికగా చెల్లింపులు



డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎక్కడికి వెళ్లినా చెల్లింపులు తేలికగా మారిపోయింది. గూగుల్ పే, ఫోన్‌పే లాంటి ఆన్‌లైన్ యూపీఐ పేమెంట్లను ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. హడావుడిలో బయటకు వెళ్లినప్పుడు, డబ్బులు మరిచి పోయినా ఇబ్బందులు పడే పరిస్థితి ఇప్పుడు లేదు. ఫోన్ ద్వారానే డబ్బులు చెల్లిస్తున్నాను. ప్రతి షాపులోనూ యూపీఐ పేమెంట్లు అందుబాటులోకి రావడంతో అన్నిచోట్ల ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నా.

– గొంతిన రామకృష్ణ, ఫోన్‌పే యూజర్

భద్రత పెరిగింది



ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, క్యూర్ కోడ్ చెల్లింపులు సామాన్యులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. జేబులో డబ్బు పెట్టుకువెళ్లడంతో గతంలో ఎవరో ఒకరు కొట్టేయడం, అజాగ్రత్త వల్ల ఎక్కడైనా పడిపోవడంతో నష్టం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితిని డిజిటల్ పేమెంట్ ద్వారా అధిగమించాం. కొన్ని చోట్ల వారికి కావాల్సినంత చిల్లర లేకపోవడంతో మరో దుకాణంలోకి వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు రూపాయి చెల్లింపు కూడా డిజిటల్ పేమెంట్ ద్వారానే చెల్లిస్తున్నాం.

– ముమ్మిన మోహన్, స్థానికుడు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్ కోట దిబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 8న నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీటీ నటరాజన్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాటి పేట, బావిశెట్టి వారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వాహనాలు అడ్డుగా పెడుతున్నారని ఫిర్యాదు


తన ఇంట్లోకి వెళ్లే మార్గంలో అడ్డుగా పెట్టిన వాహనాలు

ఏలూరు (టూటౌన్): తన ఇంట్లోకి వెళ్లే మార్గంలో వాహనాలను అడ్డుగా పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక 29 డివిజన్ చంద్రగుప్త కాలనీకి చెందిన ఎండి నసీమా సోమవారం కలెక్టర్ వెట్రి సెల్వికి ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం పన్ను చెల్లించి, లక్షలు వెచ్చించి ఇంటిని నిర్మించుకున్నా ఇంట్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా సమీపంలో నివాసం ఉండే వ్యక్తులు తమ కార్లు, మోటారు సైకిళ్లను అడ్డుగా పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై గతంలో ఎస్పీకి ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. తనకు అడ్డంకులు సృష్టిస్తున్న ఇద్దరు వ్యక్తులు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నందును ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారంటూ వినతి పత్రంలో పేర్కొన్నారు.

వృద్ధుడి బ్యాంకు ఖాతా నుంచి నగదు చోరీ

జంగారెడ్డిగూడెం: గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కార్డు మార్చి తన ఖాతాలో నగదుచోరీ చేసినట్లు మర్లగూడానికి చెందిన వృద్ధుడు పరిటాల లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. లక్ష్మీనారాయణకు జంగారెడ్డిగూడెం కొవ్వూరు రోడ్డులోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఈ నెల 27వ తేదీ ఉదయం ఏటీఎం నుంచి డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు, నిరక్షరాస్యుడు కావడంతో ఏటీఎం సెంటర్‌లో ఉన్న యువతి, యువకుడిని సంప్రదించగా, వారు రూ.3500 డబ్బులు డ్రా చేసి లక్ష్మీనారాయణకు ఇచ్చారు. అయితే వారు ఏటీఎం కార్డును మార్చి ఇచ్చిన విషయం లక్ష్మీనారాయణ గమనించలే దు. అనంతరం ఆ అకౌంట్ నుంచి దపదపాలు గా రూ.31,500 విత్ డ్రా అయ్యాయి. సోమ వారం తన పాస్‌పుస్తకంలో పోస్టింగ్ వేయించుకునేందుకు వెళ్లిన లక్ష్మీనారాయణ నగదు విత్ డ్రా విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ సర్పంచ్‌పై దాడిని ఖండిస్తూ ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ఏలూరు (టూటౌన్): పెదవేగి మండలం కవ్వగుంట గ్రామంలో దళిత మాజీ సర్పంచ్ మద్దాల నాగయ్యతోపాటు కొందరు దళిత యువకులపై మారణాయుధాలతో చేసిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. కవ్వగుంటలో దళితులపై దాడి చేసి తిరిగి దళితులపైనే కొందరిని కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదవేగి పోలీసులు దళితులపై దాడి చేసిన వారిని వదిలి, దళితేతరుల దాడిలో గాయపడ్డ దళితులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని తెలిపారు. దళితులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టకుండా దాడుల్లో గాయపడ్డ దళితులపై కిడ్నాప్ కేసులు, హత్యాయత్నం కేసులు నమోదు చేయడం పట్ల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి దళితులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుకోవాలని కోరారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముళ్లపూడి సుమన్, బయ్యారపు రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ మద్దాల నాగయ్య, ఎమ్మార్పీఎస్ శ్రేణులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలపై వినతి

ఏలూరు (టూటౌన్): సమస్యలను పరిష్కరించాలని చేనేత పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య డిమాండ్ చేశారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక కలెక్టర్‌లో కలెక్టర్‌కు చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. చేనేత సహకార సంఘాలకు, సొసైటీలకు ప్రభుత్వం బకాయి పడిన డబ్బు చెల్లించాలని కోరారు. చేనేత సహకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని, చేనేతపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, పరికరాలను ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. చేనేతకు రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. జౌళి శాఖ నుంచి చేనేతను విడదీయాలని కోరారు. చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, చేనేత కార్మిక సంఘం నాయకులు పిచ్చుక నాగేశ్వరరావు, పడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

తారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు

ఏలూరు నగరంలో వివిధ కూడళ్ల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు తారెత్తిస్తున్నాయి. వీటికి చాలాచోట్ల చుట్టూ ప్రహరీలు లేవు. హెచ్చరిక బోర్డులు లేవు. ఈ ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఆనుకునే చిరువ్యాపారాలు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ స్టాల్స్, వాహనాల పార్కింగ్ లాంటివి ఉంటున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని.. ఇది చూసిన ప్రజలు వాపోతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్/ ఏలూరు


ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్


ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే హోటల్


ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే పార్కింగ్


ట్రాన్స్‌ఫార్మర్ కిందే చర్మకార్మికుడు


ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే టీ బడ్డీ

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు - జేడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34-38	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	7-10
బెండకాయలు	40	కంద	68
పచ్చిమిర్చి	54	బీట్‌రూట్	34
కాకర కాయలు	50-54	కీరా దోస	48
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	100-160
క్యాబేజీ	34	కొత్తిమీర (కట్ట)	15-18
క్యారెట్	34-58	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం


జెడ్పీఎదురుగా మెయిన్ రోడ్డు స్ట్రీట్ లైట్ స్తంభంపై కాలిపోతున్న వైర్లు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు ప్రధాన రహదారిపై జెడ్పీ కార్యాలయం ఎదురుగా స్ట్రీట్ లైట్ స్తంభం మధ్యలో ఉన్న వివిధ రకాల కేబుల్స్ కారణంగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, దుకాణాల్లోని వారు ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. నగరంలో విద్యుత్ స్తంభాలకు భారీగా వివిధ రకాల కేబుల్స్‌ను కలుపుతూ వెళ్లడం పరిపాటిగా మారింది. కొన్నిచోట్ల ఏకంగా వివిధ కంపెనీలకు చెందిన కేబుల్స్‌ను భారీగా మెలికలు తిప్పి మరీ వేలాడదీస్తూ ఉంటారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ చాలా ఏళ్లగా ఇదే తరహాలో ఏర్పాటు చేస్తూ ఉండడంతో అధికారులు సైతం చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు.

దోమల నిర్మూలన చర్యలు


దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఒకవైపు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌తోపాటు, మరోవైపు దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ నీటి నిల్వ ప్రాంతాల్లో వేస్తున్నామని ఏలూరు నగర హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగంతో కలిసి ఏలూరు వన్‌టౌన్ 3వ డివిజన్‌లోని మారుతీనగర్, నవాబ్‌పేట కాలనీ, నవాబ్‌పేట శ్మశానం ఏరియా, జాలిపూడి డ్రెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు మురుగు కాలువల్లోనూ, కల్వర్టుల కింద ఫాగింగ్ చేస్తున్నామని, ఖాళీ స్థలాలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని హెల్త్ ఆఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బోను రాజు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

డీ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ఎంపిక



డీపీఆర్‌టీయూ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామకపత్రాలు అందిస్తున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డెమోక్రటిక్ పీఆర్‌టీయూ (డీ పీఆర్‌టీయూ) ఏలూరు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవమైనట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.శ్రీను, పి.వెంకటేశ్వర రావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ తలపంటి శ్రీనివాసరావును జిల్లా అధ్యక్షుడిగా, శ్రీపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నేతల చంద్రశేఖర్ ఆజాద్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశామన్నారు. వీరికి సోమవారం డీ పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. నూతన నాయకులకు ఆ సంఘ నాయకులు మరడాని అచ్యుతరావు, ఆర్ వెంకటేశ్వరరావు, ఎం రాంబాబు, ఆర్ నాగేంద్ర సింగ్, టి.సందీప్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

టాటా, ముళ్లపూడిలకు నివాళి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలకపాత్ర పోషించిన జేఆర్‌డీ టాటా, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ సూచించారు. సీఆర్‌రెడ్డి కళాశాల సీఐఐఈ, ఈడీసీ, ఎంబీఏ, ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపకులు ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 103వ జయంతి, టాటా గ్రూపుల వ్యవస్థాపక అధ్యక్షులు భారత రత్న జేఆర్‌డీ టాటా 120వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సమన్వయంతో పనిచేయాలి


మీకోసం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. సోమవారం గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అర్జీదారులకు అసౌకర్యం కలుగకుండా కలెక్టరేట్ సిబ్బంది విధులు నిర్వహించాలని ఆదేశించారు. జేసీ వెంట ఇన్‌చార్జి డీఆర్‌ఓ ముక్కంటి, ఆర్డీఓ ఎన్‌ఎస్‌కే ఖాజావలి ఉన్నారు.

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు


శ్రీరామలింగేశ్వర స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ విద్యావిధానం (ఎన్ఎస్ఈపీ) - 2020 నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు ఎంఈఓలు రూపావతు రంగయ్య, రవి ప్రకాష్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగాయి. పాఠశాల అభివృద్ధిలో ప్రజలు, దాతలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం ప్రధాన ఉద్దేశంగా సోమవారం సామాజిక భాగస్వామ్య కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా విషయక వస్తువులు పంపిణీ చేశారు.